క్లుప్తంగా

ఎన్‌బీకేఆర్ విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సీఎస్ఈ మూడో సంవత్సరం చదువుతున్న షేక్ అస్మా జబీన్ కోడింగ్ డిబగ్గింగ్‌లో ప్రతిభ చూపినట్టు హెచ్‌వోడీ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తోపాటు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు శుక్రవారం విద్యార్థినిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో టెక్నోవల్స్ సదస్సు నిర్వహించారని తెలిపారు. అందులో తమ కళాశాల నుంచి షేక్ అస్మాజబీన్ పాల్గొన్నట్టు పేర్కొన్నారు. కోడింగ్ డిబగ్గింగ్‌లో మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు.

పనుల్లో వేగం పెంచాలి

కోట: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎంపీపీ దాసరి అంజమ్మ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ఎంపీడీవో గోపీ మాట్లాడుతూ రూ.2.50 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు అవసరమో గుర్తించి తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే ప్రతిపాదనలు పంపుతామన్నారు. మండలంలో 8 సచివాలయాల భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయాయని, వాటిని పూర్తి చేయాలని ఎంపీటీసీలు కోరారు. వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలని, మంచినీటి పథకాలు పనిచేయని చోట ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సౌజన్య, జెడ్పీటీసీ కోటయ్య, డీటీ అజంతుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

సూళ్లూరుపేట : విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల వల్ల శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఏడీఈ శేఖర్ తెలిపారు. సూళ్లూరుపేట పట్టణంలోని బజారు వీధులు, వనంతోపు, పరమేశ్వరినగర్, సాయినగర్, షార్ కాలనీలు, గురుకుల పాఠశాల, బాబానగర్, కస్పారెడ్డిపాళెం, దేగలపాళెంలో, అటకానితిప్ప, కొరిడి, పేర్నాడు, తోటకట్ల, మంగళంపాడు, దేగావారి కండ్రిగ, మంగానెల్లూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అనీల్ తెలిపారు. మండల కేంద్రమైన ఓజిలిలో విద్యుత్ ఉండదన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు

దొరవారిసత్రం: మండలంలోని వేణుంబాకం సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం బైక్‌ను కారు ఢీకొంది. దీంతో హెడ్ కానిస్టేబుల్ గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. దొరవారిసత్రం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ గురువారం రాత్రి నెలబల్లిలో గంధోత్సవానికి బందోబస్తుకు వెళ్లారు. శుక్రవారం ఉదయం స్టేషన్‌కు వస్తుండగా కారు ఢీకొంది. గాయపడిన ఆయనను స్థానికులు 108లో నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అదుపుతప్పి లారీ బోల్తా

నాయుడుపేట టౌన్ : నాయు డుపేట పట్టణం సమీపంలోని జాతీయ రహ దారి కూడలిలో శుక్రవారం చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు. అతివేగంగా రావ డం వల్లే అదుపుతప్పి బోల్తా పడినట్టు స్థానికు లు తెలిపారు. ఇక్కడ ప్రజలు ఎక్కువగా ఉంటారని, లారీ బోల్తా పడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని వెల్లడించారు. పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్సు, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు

సైదాపురం: మండలంలోని కలిచేడు సమీపంలో స్కూల్ బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు కథనం మేరకు.. పొదలకూరు మండలంలోని చిట్టేపల్లి గ్రామానికి చెందిన మదాల ప్రసాద్ తన భార్య పిల్లలతో కలిసి బైక్‌పై తురిమెర్ల గ్రామంలో జరిగే శ్రీరామనవమి వేడుకలకు హాజరయ్యారు. తిరిగి శుక్రవారం ఉదయాన్నే తురిమెర్ల నుంచి స్వగ్రామమైన చిట్టేపల్లికి కుటుంబ సభ్యులతో బైక్‌పై బయలుదేరారు. కలిచేడు సమీపంలోని బెథాని చర్చి వద్ద ఉన్న మలుపు వద్ద ప్రైవేట్ స్కూల్ బస్సు బైక్‌ను ఢీకొంది. దీంతో మాదాల ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. అతని కుమార్తెకు కూడా గాయాలపాలైంది. గాయపడిన వారిని 108 వాహనంలో పొదలకూరు ఆస్పత్రికి తరలించారు.

బైక్ ఢీకొని..

దొరవారిసత్రం : మండలంలోని వెదురుపట్టు సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి బైక్ ఢీకొనడంతో సైక్లిస్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. అక్కరపాక గ్రామానికి చెందిన మన్నేలి శివయ్య ఎస్ఎం అగ్రహారం గ్రామానికి సైకిల్‌పై వచ్చి పని చూసుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. వెదురుపట్టు సమీపంలో ఒంగోలు నుంచి చెన్నై వెళుతున్న బైక్ ఢీకొంది. దీంతో శివయ్య తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అక్కడికి చేరుకుని అతన్ని 108లో సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పడిగాపులు

దొరవారిసత్రం పీహెచ్‌సీ వైద్యులు సమయపాలన పాటించడం లేదు. ఇక్కడికి నేలపట్టు, మైలాంగ, నెలబల్లి, ఏకొల్లు, పాళెంపాడు, నెల్లూరుపల్లి, పోలిరెడ్డిపాళెం, గొల్లపాళెం, అక్కరపాక, కుప్పారెడ్డిపాళెం, వేణుంబాకం తదితర గ్రామాల నుంచి అనుదినం వంద మందికి పైగా రోగులు వైద్యం కోసం వస్తుంటారు. వైద్యులు లేకపోవడంతో వారు గంటల తరబడి పడిగాపులు పడాల్సి వస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎవరూ రాలేదు. కొందరు వైద్య సిబ్బంది కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ముందుగానే రైలుకు సమయం అవుతోందని వెళ్లిపోతున్నారు. – దొరవారిసత్రం



ఆకర్షణీయం



సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దేశంలోని రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దక్షిణ రైల్వే పరిధిలోని 15 రైల్వేస్టేషన్లను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ఎంపిక చేసింది. షార్ కేంద్రం, శ్రీసిటీ సెజ్, మాంబట్టు సెజ్‌లోవున్న బహుళజాతి కంపెనీల వల్ల ఆదాయం పెరగడంతో ఈ రైల్వేస్టేషన్‌ను మోడల్ రైల్వేస్టేషన్‌గా నిర్మించేందుకు చర్యలు తీసుకుంది. మొదటి విడుతగా రూ.11 కోట్లు విడుదల చేసింది. తర్వాత మరో రూ.12 కోట్లు మంజూరు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. – సూళ్లూరుపేట

మండే ఎండ

రోజు రోజుకూ ఎండ పెరుగుతోంది. ఉదయం పది గంటలకే ఎంత తీవ్రత పెరగడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడా నికి భయపడుతున్నారు. వ్యాపార కేంద్రమైన నాయుడుపేటలో నిరంతరం జనాలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారులైన దర్గా, బజారు వీధులు ఉదయం పది గంటలకే బోసిపోతున్నాయి. రెండు రోజులుగా 42 నుంచి 45 డిగ్రీల వరకు ఎండ కాస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. గురు, శుక్రవారాలు 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రి వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. – నాయుడుపేట టౌన్



జ్యోతిరావుపూలేకు ఘన నివాళి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలో శుక్రవారం జ్యోతిరావుపూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. బీసీ సంక్షేమ సంఘం, బీజేపీ, పలు సంఘాల నాయకులు వేర్వేరుగా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఓజిలిలో..

ఓజిలి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని ఎంపీడీవో విజయలక్ష్మి కొనియాడారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శులు కావ్య, మస్తానయ్య, కస్తూరయ్య, సోనమ్, భూదేవి, సుమ, సిబ్బంది నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సూళ్లూరుపేట రూరల్ : పూలేకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నాయుడుపేట టౌన్ : జ్యోతిరావుపూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

కోటలో..

కోట: స్థానిక బీసీ గురుకుల పాఠశాలలో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. బహుజన ఐక్యవేదిక నేతలు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ సరిత, మీజూరు మాధవ్, పాల మల్లికార్జున్, హేమంత్, శంకరయ్య, మోహన్‌సాయి పాల్గొన్నారు.

సూళ్లూరుపేట రూరల్‌లో..

సూళ్లూరుపేట రూరల్: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతిని ఎంపీపీ అల్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వేళ్లపాలెం కృపాకర్ రెడ్డి, అల్లూరు రమేష్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్న సత్యనారాయణ, జెట్టివేణు, కౌన్సిలర్ మీజూరు రామకృష్ణారెడ్డి, అలవల సురేష్, బద్దెపూడి మోహన్ రెడ్డి, సుధాకర్ మొదలి, చిలకా యుగంధర్, వంక దినేష్ పాల్గొన్నారు.

చిట్టమూరులో..

చిట్టమూరు : మండలంలోని ఎల్లసిరి ఎగువ గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు స్వీట్లు పంచి పెట్టారు. మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. హెచ్ఎం పుట్టమనేని ప్రసాద్, ఉపాధ్యాయులు లక్ష్మీదేవమ్మ, సత్తేటి వేణు, చంద్రయ్య, మునె య్య, ఆనంద్‌కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: జ్యోతిరావ్‌పూలే బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి విశేష కృషి చేశారని ఎంఈవో ఎండీ రఫూప్ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో జ్యోతిరావ్ పూలే జయంతిని జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాల నివాళులర్పించారు. చైతన్య సాగర్ ఉపాధ్యాయులు రాజశేఖర్, రమణయ్య, పూలే టీచర్స్ ఫెడరేషన్ నాయకులు టి.రవి, అన్నం శ్రీనివాసులు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణం కుమ్మరిగుంట షిరిడీ సాయిబాబా ఆశ్రమంలో ఆదివారం సుశీల నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వైద్యులు పి.సుధాకర్ తెలిపారు. రోగులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. ఆధార్, ఆరోగ్యశ్రీ తీసుకురావాలన్నారు.

మే 8న ఉచిత ఖత్నాలు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని బాష హైస్కూల్ ఆవరణలో మే 8న ఉచిత ఖత్నాలు(వడుగులు) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు షేక్ రఫీబాష తెలిపారు. నాయుడుపేట, ఇతర మండలాలకు చెందిన వారు తమ పిల్లలకు ఖత్నాలు చేయించుకోవచ్చన్నారు. వారికి భోజన వసతి కల్పిస్తామన్నారు. పిల్లల పేర్లు ముందుగానే 85002 07863, 94938 19869 నంబర్ల లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రాపూరు: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో భవాని తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై పొదుపు సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో సోమసుందర్, ఏపీఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలి

సూళ్లూరుపేట రూరల్ : జగనన్న కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అల్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఎస్ఐ బ్రహ్మనాయుడుకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ మంగపతి బాబాయ్ అనే వ్యక్తి ఫేస్‌బుక్ అకౌంట్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై దారుణమైన కామెంట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వేళ్లపాళెం కృపాకర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, అల్లూరు రమేష్‌రెడ్డి, కౌన్సిలర్ మీజూరు రామకృష్ణ, అలవల సురేష్, బద్దెపూడి మోహన్‌రెడ్డి, వి. సుధాకర్ మొదలి, చిలకా యుగంధర్, వంకా దినేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

సజ్జలను కలిసిన నేదురుమల్లి



సైదాపురం: వైఎస్సార్ సీపీ ప్రముఖ నేత సజ్జల రామకృష్ణారెడ్డిని శుక్రవారం తాడేపల్లిలో ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కలిశారు. వెంకటగిరి మున్సిపాలిటీలో జరిగిన అవిశ్వాస తీర్మానంలో విజయం సాధించిన తీరును వివరించారు.

దివ్యాంగ పిల్లలపై శ్రద్ధ చూపాలి

చిల్లకూరు: దివ్యాంగ పిల్లలపై తల్లిదండ్రులు, టీచర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు రాజనేని శ్రీనివాసులు సూచించారు. పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ట్రస్టు ద్వారా రూ.85 వేలతో నిర్మించిన గదిని శుక్రవారం ప్రారంభించారు. ఎంఈవో ఎండీ రఫూప్, ట్రస్టు కార్యదర్శి రామానాయుడు, హెచ్ఎం చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి, ప్రజేంద్రరెడ్డి, మాధవయ్య, సురేంద్ర, బాబు, భాస్కర్, మంజుశ్రీ పాల్గొన్నారు.



గది ప్రారంభిస్తున్న రాజనేని శ్రీనివాసులు

బాధితులకు న్యాయం చేస్తాం



మాట్లాడుతున్న ఆర్డీవో నాగసంతోషిణి అనూష

రాపూరు: నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని నెల్లూరు ఆర్డీవో నాగసంతోషిణి అనూష తెలిపారు. ఆమె శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రైల్వేలైన్‌లో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ మండలంలో రైలు నిర్మాణానికి సంబంధించి 548 మంది రైతులు భూములు కోల్పోతున్నారని చెప్పారు. పట్టా ఉన్న రైతులకు ఎకరాకు రూ.6 లక్షలు, అసైన్‌మెంట్ భూములకు రూ.3 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం రూ.4 కోట్లను బ్యాంకులో జమ చేసిందని, అభ్యంతరం లేని రైతులకు వారి బ్యాంకు ఖాతాలో నగదు జమచేస్తామని తెలిపారు. అభ్యంతరం ఉంటే కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు. తహసీల్దార్ లక్ష్మీనరసింహం, మండల రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు మోడల్ ఎగ్జిబిషన్లతో అవగాహన



అధ్యాపకులను సత్కరిస్తున్న సహచరులు

గూడూరు రూరల్ : ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు ప్రాజెక్టు మోడల్ ఎగ్జిబిషన్లతో అవగాహన పెంచుకోవచ్చని ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకులు నందకుమార్ తెలిపారు. గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎగ్జిబిషన్ నిర్వహించారు. పలువురు విద్యార్థులు పలు ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. అనంతరం అధ్యాపకులను సత్కరించారు. అధ్యాపకులు మస్తాన్‌వలి, కళాశాల ప్రిన్సిపాల్ వేణుమాధవ్, కళాశాల విభాగాధిపతులు ఇమ్మానుయేలు, రాజయ్య, అమరేంద్ర, ధనుంజయ, శ్రీనాథ్‌శర్మ, ఏవో రామయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై కేసు

దక్కిలి: దేవునివెల్లంపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత కోళ్లూరు శ్రీనివాసులుపై శుక్రవారం దక్కిలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. స్తంభాలగిరీశ్వరయ్యస్వామి తిరుణాళ్ల సందర్భంగా ఆలయం సమీపంలో ఉన్న భూమిని గ్రామస్తులు చదును చేశారు. ఈ క్రమంలో శ్రీనివాసులు గ్రామస్తులను అడ్డుకోవడంతోపాటు తమపై దౌర్జన్యం చేసినట్లు వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.

భూమి ఆక్రమణను అడ్డుకున్నందుకే కేసు

స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయ భూమి ఆక్రమణలను అడ్డుకున్నందుకు తన సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత కోళ్లూరు శ్రీనివాసులుపై అక్రమ కేసు బనాయించారని కోళ్లూరు బాలకృష్ణ ఆరోపించారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని సర్వే నంబరు 42లో 4.98 ఎకరాల భూమిని గత కాంగ్రెస్ ప్రభుత్వం టూరిజంకు కేటాయించిందని తెలిపారు. ఇందులో కొంత భూమిని గ్రామస్తులు ఆక్రమించుకున్నారని తెలిపారు. సర్వే నంబరు 42, 46, 47లలో మూడెకరాలు, దాని పక్కనే ఉన్న ఒకటిన్నర ఎకరాల ప్రభుత్వ భూమిని ఆలయానికి కేటాయిస్తూ తహసీల్దార్ గతంలో ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఆ భూమిని గ్రామస్తులు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. దాన్ని అడ్డుకున్నందుకు వీఆర్వో నరేష్ అక్కడ లేకుండానే ఉన్నట్లు తన సోదరుడిపై తప్పుడు ఫిర్యాదు చేశారని ఆరోపించారు. ఇందులో మాజీ జెడ్పీటీసీ రామచంద్ర నాయుడు, మరి కొంతమంది పాత్ర ఉందన్నారు. ఈ కేసుపై న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు.



కోళ్లూరు బాలకృష్ణ

ఘనంగా ఫార్మా ఫెస్ట్-2025

సూళ్లూరుపేట : పట్టణంలోని గోకులకృష్ణ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఫార్మాఫెస్ట్–2025ను ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ సి.శ్రీనివాస బాబా, కోశాధికారి చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ బాలగాని పవన్‌కుమార్, కళాశాల సెక్రటరీ శ్రీనివాసబాబా, కోశాధికారి మాలకొండయ్య మాట్లాడుతూ ఫార్మారంగంలో విద్యార్థులకు అవకాశాలు పుష్కలంగా వున్నాయని తెలిపారు. అనంతరం విశ్వవిద్యాలయ పరీక్షల్లో ప్రతిభ చూపిన 27 మంది విద్యార్థులకు మెడళ్లు, ప్రశంసా పత్రాలు, ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, ఏవో గుర్రం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

త్వరితగతిన నీటి తొట్టెల పనులు

చిల్లకూరు : ఉపాధి హామీ కింద గ్రామాల్లో నిర్మిస్తున్న నీటి తొట్టెల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీడీ వరప్రసాద్ ఆదేశించారు. ఆయన శుక్రవారం ఉపాధి హామీ కార్యాలయంలో పనుల రికార్డులను పరిశీలించారు. ఏపీవో గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

2వ రోజు కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

వెంకటగిరి రూరల్/రాపూరు/వాకాడు/గూడూరు రూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగింది. వెంకటగిరి డిపో కార్యదర్శి కేవీ రత్నం, రాపూరు కార్యదర్శి రమణయ్య, గూడూరులో అమరావతి జేఏసీ అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని, రిమూవెల్స్ నిలిపేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటగిరి డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌డీఏ రజాక్, బాష, కృష్ణారెడ్డి, భాస్కర్, రాజా, శివకుమార్, రాపూరు గ్యారేజ్ కార్యదర్శి సుధాకర్, ప్రెసిడెంట్ హరిబాబు, సీసీఎస్ డెలిగేట్ నిస్సార్ అహ్మద్, భాస్కర్‌రావు, గూడూరు డిపో అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి చెంగయ్య, కడప జోన్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఈవీ కుమార్ పాల్గొన్నారు.

‘స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు’

చిల్లకూరు : పరిశ్రమంలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడంలో ప్రధాన ప్రతినిధులు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆరోపించారు. ఆయన శుక్రవారం కూటమి నేతలతో కలిసి తమ్మినపట్నం సమీపంలో ఉన్న జిందాల్ సింహపురి పరిశ్రమ ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిందాల్ పరిశ్రమ ఏర్పాటు చేసినప్పటి నుంచి స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని పలుమార్లు సిఫార్సు చేశామన్నారు. అర్హతకు తగిన ఉద్యోగం కాకుండా ఇతర ఉద్యోగాలు ఇస్తున్నారని దుయ్యబట్టారు. ఇక్కడి నిరుద్యోగులకు పరిశ్రమ స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేసి అటు తరువాత అర్హతకు తగ్గ ఉద్యోగం ఇస్తే బాగుంటుందన్నారు. పరిశ్రమ యాజమాన్యం ముందుకు వస్తున్నప్పటికీ ప్లాంట్లలో పని చేసే పెద్దలు స్థానికులకు అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇకనైనా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, లేకుంటే సీఎం దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే, నాయకులు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యకర జీవనం

సైదాపురం : పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యకర జీవనం సాధ్యమని రాపూరు ప్రాజెక్ట్ సీడీపీవో సునంద తెలిపారు. మండలంలోని చాగణం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంపై అవగాహన లేకపోవడం వల్లే పోషకాహార లోపం తలెత్తి రక్తహీనతకు దారితీస్తుందన్నారు. రాపూరు ప్రాజెక్ట్ సీడీపీవో సునంద మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు పాలు, గుడ్లు, ఆకుకూరలు తీసుకోవాలని కోరారు. సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పక తీసుకోవాలి

రాపూరు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య తెలిపారు. తాతిపల్లిలో శుక్రవారం పోషణ్ పక్వాడాలో భాగంగా గర్భిణులకు వెయ్యి రోజుల సంరక్షణపై అవగాహన కల్పించారు.

బైక్‌కు నిప్పు పెట్టిన మహిళ

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని తెలుగురాయపురం కమ్యూనిటీ హాల్ వద్ద నిలిపిన బైక్‌ను మహిళ తగలబెట్టింది. స్థానికుల కథనం మేరకు.. రాపూరు మహేంద్ర అనే వ్యక్తి ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ కమ్యూనిటీ హాల్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. అతని ఇల్లు చిన్నది కావడంతో బైక్‌ను కమ్యూనిటీ హాల్ వద్ద నిలుపుతున్నాడు. అదే ప్రాంతంలోనే ఉంటున్న ఒక మహిళ అక్కడ బైక్‌ను నిలపడంపై గొడవ చేస్తోంది. శుక్రవారం చెత్తాచెదారం పోసి బైక్‌ను తగలబెట్టింది. ఈ విషయమై ప్రశ్నించినందుకు టీడీపీ నేతలతో కలిసి అక్రమంగా కేసు నమోదు కూడా చేయించింది. ఫీల్డ్ అసిస్టెంట్‌గా రాజీనామా చేయాలని తనపై టీడీపీ నేతలు ఒత్తిడి తెచ్చారని, తాను అంగీకరించకపోవడంతోనే ఇలా చేస్తున్నారని బాధితుడు వాపోయాడు.

లారీ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

గూడూరురూరల్: లారీ డ్రైవర్ అజాగ్రత్త కారణంగా ఓ మహిళ రెండు కాళ్లు పోగొట్టుకున్న సంఘటన శుక్రవారం గూడూరు పట్టణంలోని బనిగేసాహెబ్‌పేట ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గూడూరు బనిగేసాహెబ్ పేట ప్రాంతానికి చెందిన సయ్యద్ పర్వీన్ అనే మహిళ రోడ్డు దాటుతున్న సమయంలో నెల్లూరు వైపు వెళుతున్న ఓ టిప్పర్‌ను అధిగమించే సమయంలో లారీ డ్రైవర్ మహిళను ఢీకొన్నాడు. దీంతో ఆమె రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. దీంతో స్థానికులు ప్రమాదాన్ని గుర్తించి ఆమెను గడూరు ఏరియాస్పత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నట్లు ఒకటో పట్టణ ఎస్ఐ తిరుపతయ్య తెలిపారు.